

# ఆలోచన

పి.యస్.నారాయణ

రాజశేఖరం సూటిగా శశిరేఖ కళ్ళల్లోకి చూస్తున్నాడు.

ఏదో అడగాలి అన్నట్లుగా అతడు పెదాలను తడిచేసుకుంటున్నాడు.

శశిరేఖ ఏం సమాధానం చెబుతుంది?

చెయ్యెత్తి వేళ్ళతోటి జుట్టు సరిచేసుకున్నాడు— శశిరేఖను అసలు అడుగుదామా వద్దా అన్నట్లుగా ఆలోచిస్తూ.

ఆ గదిలో దీపం వాళ్ళమధ్య రహస్యాలను పటాపంచలు చేసేటందుకే నన్నట్లుగా దేదీప్యమానంగా వెలుగుతోంది.

రాజశేఖరం ఎదురువెళ్ళి శశిరేఖను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుందామా అన్నట్లుగా కదలబోయాడు గాని—మనస్సులోని ఆలోచన మనిషిని బందీచేస్తోంది.

తమమధ్య ఎలాంటి దాగుడుమూతలూ ముందు జీవితంలో ఉండగూడదు అను కున్నాడు రాజశేఖరం.

ఆమె తను ఒకరే అన్నట్లుగా- ఇంకె వ్వరూ ఈ ప్రపంచంలో విడదీయలేరూ అన్నట్లుగా వాకిటి తలుపులు మూసుకు పోయినయి.

భవిష్యత్తు ఎంత అందంగా వుండాలని కోరుకుంటూ ఎలా అంత అందంగా అలంకరించబడింది ఆ గది.

శశిరేఖ టేబుల్ పక్కకు వచ్చి- కొద్దిగా టేబుల్‌మీద మోచేయి ఆనించి వంగొని కావల్సిన స్టేషన్ వెతుక్కుంటు న్నట్లుగా రేడియో నాబ్ తిప్పుతోంది.

టేబుల్ పక్కగా స్టూలుమీద-తెల్లటి అల్లికపు గుడ్డమీద - వెండి పళ్ళెంలో పాలకోవాబిళ్ళలు....పక్కగా గ్లాసులలో గోరువెచ్చని పాలు.... రేడియో మీద సంపెంగ వాసనలు వెదజల్లుతూ.... తరిగిపోతున్న ఊదుకడ్డీలు....

రేడియోలో హిందీ పాట....

వీపుమీద విలబడలేనట్లుగా జారిపోయి .... తెల్లచీరమీద కొట్టొచ్చినట్లుగా కన బడుతున్న నల్లని వాలుజడ....ఆ జడలో పైగా తెల్లని మల్లెలు....

తనలో మరిగిపోతున్న ప్రశ్నను ఆమె ముందుంచుదామా వద్దా అన్నట్లుగా అటూయిటూ కదిలాడు రాజశేఖరం....

అరగంట క్రితంవరకూ రాబోయే మధురక్షణాలను గురించి ఉద్వేగపడు తున్న రాజశేఖరంలో.... బిగించిన తలు పులకు అడ్డంగా విలబడివున్న శశిరేఖను చూడగానే ఓ వింత ఆలోచన ఉదయిం చింది ... అతడిని కలవరపరిచింది.... శరీరాన్నే ఊపేసింది.

ఆమెనే అడిగితే....

శశిరేఖ ఇంత అందంగా వున్నదే.... కాలేజీలో చదివిందే.... యూనివర్శిటీలో చదువుతోందే.... ఆమెకు ఒక్కరు.... ఒక్కరైనా బాయ్‌ఫ్రెండ్ లేదా?

ఉంటే....??

-అందునా రెండు సంవత్సరాలు హాస్టల్లో వుందట....

ఉండవచ్చు!!!

అతడిని ఆ ఆలోచన నల్లగా కప్పి వేసింది.... భయంతో కదిలించివేసింది.

ఆమెనే అడిగితే....

చెబుతుందా?....

సమాధానం ఏమని చెబుతుంది!....

మంచంమీదగా పైకివేసిఉన్న దోమ తెరను తదేకంగా చూస్తున్న అతడిలో- అందులో దూరి దారితెలియక గిలగిలా కొట్టుకుంటున్న దోమలా- అతడిలో, ఆలోచన గిలగిలా కొట్టుకుంటోంది.

—కోపంతో ఆగదిలోంచి వెళ్ళిపోతే?

—తనకే ఆ ప్రశ్న ఎదురువేస్తే?

—ఏడ్చి గోలచేస్తే?

అర్థంలేనిభయం....మింగలేని తపన.

—పిచ్చి పిచ్చి ఆలోచనలకు స్వస్తి చెప్పి.... ఆమెను దగ్గరకు తీసుకొని.... గుండెలకు హత్తుకొని....

"శశిరేఖా!" చిన్నగా- తుమ్మెద నాదంలా పిలిచాడు.

మొఖం పక్కకుతిప్పి.... సిగ్గుగా.... మనోహరంగా.... నోటిని విల్లులా విరిచి .... నవ్వీ నవ్వకుండా నవ్వింది.

"ఇలా రా!"

మెడమీద నుండీ జారిన వాలుజడ.... వయ్యారంగా నేలకు అడుగు ఎత్తున నృత్యంచేస్తున్న నాగులా ఉన్నది....

అందమైన జడ ఆడదానికి అందం.... ఆ పైనున్న తెల్లని మల్లెలు ఆ జడకే అందం.... అలాంటి జడ గలిగిన ఆడది ఆ గదికే అందం....

తనదైన శశిరేఖనే తరచి తరచి చూస్తున్నాడు రాజశేఖరం.... మనస్సు శశిరేఖచుట్టూ పరిభ్రమిస్తోంది...

సన్నగా.... పొడుగ్గా.... ఎర్రగా.... పెద్దపెద్ద కళ్ళతో....

పెళ్ళి చూపుల్లో చూచిన మొదటి క్షణంలోనే ఆ అమ్మాయి తనకు-శశిరేఖా రాజశేఖరంలా- కనబడింది!

ఆమె అందానికి హాట్సాఫ్....

నవమన్మధుడూ అని నలుగురూ అనుకునే తనే ఆమెకు నచ్చనేమో నన్నంత భయపడ్డాడు.... తరువాత- వాళ్ళదగ్గరనుంచీ 'ఓకే' అని ఉత్తరం వచ్చేటంతవరకు....

ఉత్తరం వచ్చింది తనని గాలిలోకి తేలుస్తున్నట్లుగా.

పెళ్ళయింది తనని స్వర్గంలోకి నెడుతున్నట్లుగా.

—ఈ క్షణాన తను స్వర్గంలోనే వున్నాడు.

"శశిరేఖా!"

"ఊఁ...."

"ఊఁ...."

ఆమె కాళ్ళు ఒణుకుతున్నాయి.... సన్నని ఆమె చేతివేళ్ళు వణుకుతున్నాయి .... గుండె గుబగుబలాడుతోంది....

రాజశేఖరం మంచం మీదినుంచి లేచాడు.... అడుగులో అడుగు వేసుకుంటూ శశిరేఖ వైపుకు నడుస్తుంటే శశిరేఖ ఆకాశవీధుల్లో అడుగుపెడుతున్నట్లుగా తన్మయంగా కళ్ళుమూసుకున్నది.

ఆలోచన చదపురుగు లాంటిది.... అందునా మనస్సుకు పట్టిందయితే ఇంకేమున్నది.... ఆనందాన్ని, జీవితాన్ని పూర్తిగా తినేస్తుంది.... పట్టనే పట్టగూడదు ... పట్టిన మరుక్షణంలోనే తీసి నలిపివేయటం అన్ని విధాలా ఉత్తమం...

రెండు చేతులూ పట్టుకొని తనవైపుకు తిప్పుకుంటూ "శశిరేఖా! ఒక్క ప్రశ్నకు సమాధానం చెబుతావా?" అన్నాడు రాజశేఖరం.

"అడగండి!" అన్నది రేడియో నాబ్‌నువదలి పిలుచుంటూ... మెడ వెనుక వదులుగా వదలిన జుట్టు అటూ యిటూ కదలింది చెవులకున్న గాజుల తిరిగులా ఊగిన ఝుంకీ తిప్పగానే.

"ఒకటేమిటి.... వందైనా నాకు సంతోషమే!"



"నువ్వేమీ అనుకోగూడదు !"

"అంత పవర్‌ఫుల్‌గా వుంటుందా ఆ ప్రశ్న !" ఎడమవైపు పంటిమీద పన్ను కనబడేలా నవ్వింది.

మురిపంగా చూశాడు రాజశేఖరం శశిరేఖను.... తన చేతిలోకి తీసుకున్న ఆమె చేతివేళ్ళను నొక్కసాగాడు.

"నన్ను అపార్థం చేసుకున్నావు గదా!" అన్నాడు అపాలజిటిక్‌గా.

"అపార్థం దేనికి ?"

తడబడ్డాడు రాజశేఖరం– 'ఛ ! వెధవ ఆలోచన.... అడిగి శశిరేఖ మనసు పాడుచేసేదానికంటే– అడగకుండా, గతం గురించి ఆలోచించకుండా సుగంధభరితమయిన వర్తమానంతో భవిష్యత్తును పూలబాట చేసుకోక.... ఎందుకీ వెధవ ఆలోచనలు....'

'కానీ.... కానీ.... నిజం తెలుసుకోవడంలో తప్పేమున్నది....?'

"ఏదో అడుగుతానని ఆలోచిస్తున్నారేమిటి సార్!" అన్నది.... నలిపేస్తున్న తన చేతివేళ్ళను అతడి చేతిలోనుండి తీసుకో ప్రయత్నిస్తూ.

ఇంకా ఆలస్యం చేయటం అనవసరం

అన్నట్లుగా కొద్దిగా ఆమె పైపుకు జరిగాడు, "నువ్వు కాలేజీలో చదివావు... యూనివర్శిటీలో చదువుతున్నావు....నీకు బాయ్‌ఫ్రెండెవ్వరూ లేరా ?"

ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తి సూటిగా రాజశేఖరం కళ్ళలోకి చూసింది శశిరేఖ.

క్షణం కళ్ళను రెపరెపలాడించింది అతడివంకే చూస్తూ.

అతడు తడబడ్డాడు.... సిగ్గుపడుతున్నట్లుగా తల వంచుకున్నాడు.... ఆమెను ఎదుర్కొలేనట్లుగా మొఖం పక్కకు తిప్పుకున్నాడు.

"అది నాకేమన్నాఅనర్హతా" అన్నది పన్నుతో క్రింది పెదిమనునెత్తురువచ్చేలా నొక్కుకుంటూ- చురుగ్గా అతడి వాలిపోతున్న మొఖంలోకి చూస్తూ.


"లేదు....లేదు !" అన్నాడు నంగిగా .... ఎందుకు అలాంటి ప్రశ్న వేశానా అన్నట్లుగా గిల్టీగా ఫీలవుతున్నాడు.

ఫక్కున నవ్వింది శశిరేఖ. "అసలు ముందు నేనే చెప్పేదామనుకున్నాను.... మీరు అడగనే అడిగారు.... కాలేజీలోనూ, యూనివర్శిటీలోనూ చదివింతరువాత బాయ్ ఫ్రెండ్స్ లేకుండా ఎలా వుంటారు మాష్టారు.... అందునా నాలాంటిదానికి!" గర్వంగా తీవిగా అన్నట్లనిపించింది.

"ఊఁహూఁ....అదిగాదు నాఉద్దేశ్యం"

"మీరు ప్రశ్న వేశారు.... నా సమాధానం పూర్తిగా వినటం మీ విధి.... అవునా.... ఇక మధ్యలో మాట్లాడకుండా నేను చెప్పిందంతా వినండి.... ఉన్నారు అన్నానుగదా.... వున్నారు.... ఒకరు గాదు ముగ్గురు.... చక్రవర్తి, శశిధర్.... సహదేవ - నార్త్ అతను.

ముగ్గురూ చాలా క్లోజ్‌గావుండేవాళ్ళం ఒకే యింట్లో వుండేవాళ్ళలా వుండేవాళ్ళం.... ఒకేసారి కాలేజీకి వెళ్ళటం, ఒకేసారి రావడం....ఒకేసారి క్యాంటిన్ అంతదాకా ఎందుకు ఒకరి రూంలోనే అంతా కలసి చదవటం.... అప్పుడే నా మీద కథలు మొదలయినాయి. ఈ వెధవ ప్రపంచం సంగతి తెలిసిందే గదా మీకు.... యింతుంటే అంత చేస్తారు.... అంతుంటే ఇంక సరేసరి.... గోడల మీద కెక్కిన యీ మా పేర్లు.... సరే ఆ వెధవగొడవలు పోనీయండి గాని.... అందరిలోకి నాకు చక్రవర్తంటేనే యిష్టం.... చక్రవర్తికీ అంతే.... ఒకసారి ఎవ్వరికీ చెప్పకుండా మేంయిద్దరం ఢిల్లీ వెళ్ళిపోయాం.... ఆగ్రా చూడాలని తపన.... ఆ పైన కాశ్మీరుకు వెళితే ఎంత బాగుంటుందోనని ఆలోచన.... తీసుకువెళ్ళిన డబ్బులు చాలనేమోనని భయం.... అప్పటికీ చాలా జాగ్రత్తగా వాడేవాళ్ళం.... రెండు రూంలు తీసుకుంటే చాలా ఖర్చని ఒకే గదిలో గడిపేవాళ్ళం.... అదంతా ఒక కథ అనుకోండి.... తరువాత అనుకోకుండా అక్కడుతురే చక్రవర్తికి పెళ్ళామయి




పోయింది.... నేను పెళ్ళికి గూడా వెళ్ళాను.... నా అంత కాకపోయినా బాగానే వుంటుంది.... ఇప్పుడు బెంగుళూరులో ఏదో కంపెనీలో యింజనీరుగా వుంటున్నాడు.... నా పెళ్ళికి రాలేకపోయినందుకు విచారిస్తూ జాబురాశాడు. ఇక శశిధర్.... సదిదేవ.... వాళ్ళిప్పుడు ఎక్కడున్నారో తెలియకుండా వెళ్ళిపోయారు.... అయితే మీ ప్రశ్నకు ఇది నా సరైన సమాధానం ఔవుతుందో లేదో నాకయితే తెలియదుగాని నిజం దాచకుండా చెప్పాను.... ఇంకెవ్వరూ నాకు అంత దగ్గరగా రాలేదు.... నా స్నేహంకోసరం ఒకళ్ళిద్దరు ట్రైచేసిన మాట వాస్తవమేగాని నేనే ఎంకరేజ్ చేయలేదు.... వాళ్ళను చూస్తే నా కదో ఎలర్జీ.... ఏం.... ఇంకేమైనా అనుమానాలుంటే అడగండి.... ఇక మీకు ఏ అనుమానమూ లేకుండా వుంటే — నేను మీ భార్యగా పనికివస్తాను అనుకుంటే నేను మేడ మీద వెయిట్ చేస్తుంటాను వచ్చేయండి లేదా...ఒకే..." ఒక్క క్షణం కలవరపడుతున్నట్లుగా ఆగింది "రాం... రాం!" చురకత్తిలా దూసుకుపోతున్నట్లుగా పక్కతలుపు తీసుకొని పైకి వెళ్ళిపోయింది శశిరేఖ

నోరు తెరుచుకు చూస్తున్న రాజశేఖరం ఉలిక్కిపడ్డట్లుగా ఆమె వెళ్ళిన వైపు చూడసాగాడు.

తన ప్రశ్నకు శశిరేఖ ఫెండ్ అయింది.

నీరసంగా మంచంమీద కూలబడ్డాడు. శూన్యంలోకి చూస్తున్నట్లుగా తలగడ వైపుకు చూస్తున్నాడు.

అక్కడ మల్లెపూలతో తెల్లటి గలీబులో యూఫోమ్ దిండున్నది....

ఆ తెల్లటి గుడ్డమీద ఎర్ర దారంతో 'ఐ లవ్ యూ' అని కుట్టివున్నది.

దాన్ని చేతిలోకి తీసుకొని నొక్కసాగాడు.

'ఏ స్త్రీ.... భర్తతో గడపబోయే మొదటిరాత్రి ఇంత చేదుగా చేసుకోదు.... భర్త ఒక మాట అడిగిందే తడవుగా ఇంత విపులంగా తన గురించి అతడికి తెలియని తన గతం గురించి విపులీకరించదు - జీవితాంతం అతనికి శత్రువవ్వనూ అవ్వదు.... తన జీవితాన్ని తన చేతులతోనే పెట్రోలు పోసి తగలబెట్టుకోదు!'

"నో... నో....నో"

'ఎంత దెబ్బకొట్టావ్ శశిరేఖా.... ఇంకెప్పుడూ నా మనసులో పిచ్చి పిచ్చి ఆలోచనలు రేగకుండా మంచి గుణపాఠం చెప్పావ్....' అనుకుంటూనే చేతిలోని రుమాలు పైకెగరేసి పట్టుకొని గుండెలకు హత్తుకున్నాడు.

'ఐ లవ్ యూ... శశిరేఖా! ఐలవ్ యూ'

సరిగ్గా అదే సమయంలో శశిరేఖ మేడ మీద ఒంటరిగా పిట్టగోడనానుకొని నిల్చొని చెట్లలోనుంచి పైకి వస్తున్న చంద్రుడిని చూస్తూ ఆలోచిస్తోంది.

— దొంగతనం చేశాడనే అనుమానం మీద ఓ మనిషిని పట్టుకొని-చేశావా లేదా అంటే - చేశానూ అంటే కథే లేదు.... చేయలేదూ అంటేనే తన్నటం, గుద్దటం, చిత్రహింస చేయటం - వాటిని భరించే దానికంటే చేశానని ఒక్కమాట చెప్పి జైల్లో కూర్చోవటం హాయి....

- అలాంటిదే ఈ మొగవాళ్ళ మనస్తత్వం...అసలు అలాంటి ఆలోచనే అతడిలో రాగూడదు.... వచ్చిందీ అంటే తనుకాదన్నా అది సమసిపోవడం కష్టం.... ప్రతి క్షణం తనని అనుమానపు చూపులతో చూడటంతోనే భవిష్యత్తంతా గడిచిపోతోంది....

దాన్ని అలా కొనసాగనీయాలా?

—లేక ఏదో ఒక అబద్ధమాడేసి అలాంటి ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టాలా?

ఫలితమేమౌతుంది?

ఆలోచించాలి....

తను చేసిన పని తప్పా? ఒప్పా?

—ఎంత ఆలోచించినా తెగడం లేదు....

కందిరీగల్లా చుట్టుముడుతున్న ఆలోచనల నడుమ మెట్లమీద రాజశేఖరం అడుగుల చప్పుడు ఆమె చెవులకు సోకనే లేదు....

ఒకటే ఆలోచన....

తన ప్రయోగం తప్పా? ఒప్పా?,

